క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పెద్దకడబూరు: మంత్రాలయం నియోజకవర్గ ప్రత్యేకాధికారి అనురాధ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కల్లుకుంట, జాలవాడి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తహసీల్దార్ గీతాప్రియదర్శిని తెలిపారు. 1,300 ఓట్లుకు పైగా ఉన్న కేంద్రాలను తనిఖీ చేసి లైట్లు, ఫ్యాన్‌లు, బాత్‌రూమ్స్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే సరి చేస్తామన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులను సాయంత్రం వరకు పెట్టుకుని వారికి ప్రాథమిక విద్యను బోధించాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ జెర్మియా, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు

కోసిగి: కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం చిన్న సరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోసిగిలోని పెద్ద మజీద్, సిద్దప్ప పాళెం, ఊరువాకిలి సమీపంలోని చావిడీలలో కొలువుదీరిన పీర్ల దేవుళ్లకు భక్తులు ఫాతేహాలు సమర్పించారు. సాయంత్రం ఆయా పీర్లను ఊరేగించారు. అలాగే మండలంలోని వందగల్లు, చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి, కందుకూరు, కామన్‌దొడ్డి, సాతనూరు, డి.బెళగల్, దుద్ది తదితర గ్రామాల్లో చిన్న సరిగెత్తు వేడుకలు ప్రశాంతంగా జరుపుకున్నారు.

గోనెగండ్లలో..

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం చిన్న సరిగెత్తు, పగటి సరిగెత్తును నిర్వహించారు. పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. 5న పెద్ద సరిగెత్తు, 6న ఏటికి వెళ్లే కార్యక్రమంతో మొహర్రం ముగియనున్నట్లు ముజావర్లు తెలిపారు.


ప్రజలు అప్రమత్తంగా ఉండండి



తుంగభద్ర నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మంత్రాలయం రూరల్: తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు నీటిని విడదల చేసిన సందర్భంగా నది ప్రవాహ ప్రాంతాల ప్రజలు, మంత్రాలయం వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. తుంగభద్ర నది ప్రవాహాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. తుంగభద్ర జలాశయం నుంచి శుక్రవారం 20 గేట్లును తెరిచి నీటిని దిగువకు వదిలినట్లు పేర్కొన్నారు. ఒక్కో గేటు నుంచి సుమారు 2,913 క్యూసెక్కుల నీటి చొప్పున దాదాపు 58,260 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోందన్నారు. ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని.. నదిలోకి ఎవరూ వెళ్లరాదన్నారు. ఆమెతో పాటు సీనియర్ అసిస్టెంట్ జయరాం రెడ్డి, వీఆర్‌ఓ భీమన్నగౌడ్, సిబ్బంది ఉన్నారు.


వంగవీటి మోహనరంగా జయంతి



వంగవీటి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ఆదోని టౌన్: ఆదోని బలిజ సంఘం అధ్యక్షుడు రంగస్వామి, సెక్రటరీ చందం మల్లికార్జున ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వంగవీటిరంగా పేదల పక్షపాతి అని, కులమతాలకు అతీతంగా సేవ చేశారని కొనియాడారు. సంఘం నాయకులు శ్రీనివాసులు, లక్ష్మన్న, శేషన్న, భీమ, గోపాలకృష్ణ, ఎస్.బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

ఆదోని రూరల్: నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజేష్‌శుక్ల జన్మదినోత్సవం సందర్భంగా పలువురు శుక్రవారం రక్తదానం చేశారు. ఆదోనిలోని తలసేమియా వ్యాధి బాధిత చిన్నారులకు గోపీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.రామలింగయ్యస్వామి, బడేసాబ్, శాంతికుమార్, ఉదయ్, రవి తదితరులు రక్తదానం చేశారు. రిటైర్డ్ ఎస్పీ పి.సి.స్వామి, నేషనల్ చీఫ్ సోషల్ ప్రొటక్షన్ ఇండియా ఆదేశాల మేరకు శిబిరం నిర్వహించామని ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి.మంజునాథ్, ఏపీ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్, ఎన్ఏసీఓసీఐ మెంబర్ విరూపాక్షి తెలిపారు.

ముంచిన వర్షం

- కౌతాళంలో భారీ వర్షం
- ఇళ్లలోకి చేరిన నీరు



ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఇళ్లలోకి చేరిన నీరు



వైఎస్సార్ సర్కిల్ నుంచి దర్గా రస్తా మార్గంలో రెండు అడుగుల నీరు

కౌతాళం: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గ్రామంలోని ప్రధాన విధులు జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్‌లో రోడ్డుపై నుంచి వర్షం నీరు పారాయి. స్టేట్ బ్యాంకు ఎదురుగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నివసించే కాలనీలోకి ఇళ్లలోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో ఎత్తి వేయడానికి అష్టకష్టాలు పడ్డారు. బుధవారం కురిసిన వర్షానికి ఇండ్లలో ఉన్న తడి ఆరక ముందే మరోసారి వర్షం వారిని ఇబ్బందులకు గురిచేసింది. కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా తమ పరిస్థితి ఇలాగే ఉందని పంచాయతీ కార్యాలయంలో పనిచేసే కార్మికులు వెంకటస్వామి, సంజీవయ్య, లక్ష్మి, లక్ష్మణ తెలిపారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సర్కిల్‌లో రెండు అడుగల మేరు నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అంబేడ్కర్ విగ్రహం వెనుక భాగంలో డ్రైనేజీలో చెత్తచెదారం పేరుకుపోయి సమస్య జటిలమవుతోంది. ఆర్టీసీ బస్టాండ్ ముఖద్వారంలో ఉన్న డ్రైనేజీ పూర్తిగా ముసుకునిపోవడంతో వర్షపు నీరంతా రోడ్డుపై చేరుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారం కావడం లేదు



దశాబ్దకాలం నుంచి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. లెట్రిన్ గుంత పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. బ్యాంకు దిగువ ఉన్న ప్రాంతంలో డ్రైనేజీ పూర్తిగా చెత్త చెదారంతో నిండిపోవడంతో వర్షపు నీరంతా మా కాలనీలో వస్తోంది.

–జానకమ్మ, కౌతాళం

ఏజెంట్‌తో ఆర్టీఓ కార్యాలయ ఉద్యోగి ఘర్షణ

- మామూళ్ల విషయంపై సోషల్ మీడియాలో వైరల్



ఏజెంట్‌తో గొడవ పడుతున్న ఆర్టీఓ కార్యాలయ ఉద్యోగి మనోహర్

ఆదోని అర్బన్: ఆర్టీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మనోహర్ మామూళ్ల విషయంలో ఏజెంట్ కార్యాలయానికి వెళ్లి ఘర్షణ పడిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్థానిక పాత ఓవర్ బ్రిడ్జి కిందనున్న ఆర్టీఓ ఏజెంట్ కార్యాలయంలో గత నెల 30న లావాదేవీల విషయంపై ఆర్టీఓ ఉద్యోగి ఏజెంట్‌తో శుక్రవారం రాత్రి వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన మనోహర్ ఏజెంట్ సిబ్బందిపై చేయి చేసుకున్నాడు. ఈ తతంగమంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో పట్టణంలో వైరల్‌గా మారింది. విషయాన్ని ఎంవీఐ సిసిరాదీప్తి దృష్టికి తీసుకెళ్లగా.. తనకు ఈ విషయంపై ఫిర్యాదు వచ్చిందని, మనోహర్ ఒక విషయంలో మామూళ్లు తీసుకున్నాడని ఆరోపణలు వచ్చాయని, అది ఏజెంట్ కార్యాలయంలో సిబ్బంది ప్రచారం చేయడంతో మనోహర్ వెళ్లి నేరుగా ఏజెంట్ కార్యాలయంలో గొడవకు దిగినట్లు తెలిసిందని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తదుపరి తీసుకుంటామని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



మాట్లాడుతున్న బాలికల శిశు అభివృద్ధి అధికారిణి మేరి స్నేహలత

నందవరం: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాలికల శిశు అభివృద్ధి జిల్లా అధికారిణి మేరి స్నేహలత సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, వంట గదులు, వంటలను, విద్యార్థినుల సామర్థ్యాలు పరిశీలించారు. అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయినులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం వండాలని, వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, తాజా కురగాయాలతో వంటలు చేయాలని ఏజెన్సీ సిబ్బందికి సూచించారు.ఆమెవెంట ప్రిన్సిపాల్ శైలజ ఉన్నారు.

సమ్మె విరమణ



సమ్మెను విరమిస్తూ నినాదాలు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె విరమిస్తున్నట్లు వినతి పత్రం అందజేస్తునన ఇంజినీరింగ్ కార్మికులు

ఆదోని టౌన్: ప్రభుత్వంతో జరిపిన చర్యలు సఫలం కావడంతో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె విరమించారు. ఈ మేరకు ఆదోని పట్టణంలో 32 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మెను శుక్రవారం విరమించారు. యూనియన్ నాయకులు పీరాసాహెబ్, సోమన్న, అహ్మద్ తదితరులు మాట్లాడుతూ త్వరలో తమకు వేతనాలు పెంచుతామని, సమ్మెను విరమింపజేయాలని డీఎంఏ కోరడంతో సమ్మె విరమించినట్లు చెప్పారు. ప్రభుత్వం 15 రోజుల్లోగా జీవో అమలు చేయకుంటే మళ్లీ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సమ్మె తాత్కాలిక విరమణ

ఎమ్మిగనూరుటౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు 59 రోజులుగా చేస్తున్న సమ్మెను రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు శుక్రవారం తాత్కాలికంగా విరమించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు, రాజేంద్ర ఆధ్వర్యంలో పలువురు కార్మికులు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నట్లు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమిస్తున్నామని, మాట తప్పితే ఈనెల 16 నుంచి మళ్లీ సమ్మెలోకి వెళ్తామని వారు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

గోనెగండ్ల: మొహర్రం సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొహర్రంను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.

సీఎం క్షమాపణ చెప్పాలి

ఆదోని రూరల్: దళితులపై సీఎం చంద్రబాబునాయుడు అహంకారపూరితంగా వ్యాఖ్యానించడం తగదని, వెంటనే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఆదోని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగప్ప శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగయ్య మృతిని కూడా రాజకీయంగా వాడుకోవాలని చూడడం చంద్రబాబునాయుడుకే చెల్లిందన్నారు. సింగయ్యని కుక్కతో పోల్చడం దారుణమన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



చెన్న బసవ(ఫైల్)

కోసిగి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన కోసిగిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన చెన్న బసవ (25) అదే గ్రామానికి చెందిన బసవరాజుతో కలిసి బైక్‌పై పెద్దకడబూరు మండలం బాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి బయలు దేరారు. కోసిగి దాటిన తర్వాత ఆదోని రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చెన్న బసవ అక్కడికక్కడే మృతిచెందాడు. బసవ రాజుకు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతినికి భార్య గంగమ్మ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ హనుమంత రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించండి

నందవరం: తమ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణ రాజు, ఉపాధ్యాయులు ఎల్లప్ప, బసవరాజు, శేఖరప్ప, చంద్రశేఖర్, ఈరన్న, మద్దయ్య శుక్రవారం కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మన బడి నాడు– నేడు పథకం పెండింగ్ పనులను పరిశీలించారు. పాఠశాలలో 1,200 మంది విద్యార్థులు ఉన్నారని, నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

- నందవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమిపూజ చేశారు. రూ.2.55 కోట్లతో 6 గదులుతోపాటు మన బడి నాడు– నేడు పెండింగ్ పనులను పూర్తి చేయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 రామాంజనేయులు, ఎంఈఓ–2 రఘునాథ్, ప్రిన్సిపాల్ శైలజ, కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

ఎమ్మిగనూరుటౌన్: మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశీవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 9న చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు.

బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల యువజన సంఘం(వైపీఎల్) డివిజన్ కన్వీనర్ మునెప్ప శుక్రవారం ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సోగనూరు రోడ్డులో బెల్ట్‌షాపుల ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఐకి ఫిర్యాదు చేశారు.

క్రీడాకారుడికి చేయూత



ఫుట్‌బాల్ కిట్, క్రీడా దుస్తులు అందిస్తున్న వ్యాపారవేత్త పరమేష్

ఎమ్మిగనూరుటౌన్: జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఈశ్వర్‌కు స్థానిక వ్యాపార వేత్త పరమేష్ చేయూతనందించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన తన కుమారుడు రవితేజ జ్ఞాపకార్థం క్రీడాకారుడికి ఫుట్‌బాల్ కిట్, ట్రావెల్ బాక్స్, క్రీడా దుస్తులు అందజేశారు. న్యాయవాది రామకృష్ణనాయుడు, సత్రాజ్‌నవాబ్, వంశీకృష్ణ, సుభాన్, రాము, వంశీ, మల్లి పాల్గొన్నారు.

అల్లూరికి నివాళి

గోనెగండ్ల: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మండల పరిధిలోని చిన్నమరివీడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర రావు, లక్ష్మయ్య, కృష్ణ, మునెప్ప, మన్సూర్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న ఎస్సీ నాయకులు

కౌతాళం: గుంటూరు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగయ్య ఎస్సీ మాదిగ కుల వ్యక్తి అని కులాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు శుక్రవారం సీఐ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అవతారం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జైపాల్ మాట్లాడుతూ.. జూన్ 18న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వాడని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడి ఆ సామాజికవర్గ మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించారని తెలిపారు. సింగయ్య కేసు న్యాయస్థానంలో ఉందని, సున్నితమైన సమయంలో ప్రజాప్రతినిధులు న్యాయ ప్రక్రియకు భంగం కలిగించకుండా బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

వివాహిత ఆత్మహత్య

మంత్రాలయం: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన లక్ష్మి(32) అనే వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువుల వివారాల మేరకు... గ్రామానికి చెందిన తలారి నరసింహులు పెద్ద కుమారుడు ఆంజనేయులుకు అదే గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. లక్ష్మీ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడతోంది. మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయంగా ఆలస్యంగా తెలియడంతో రాత్రి మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ విచారణ చేపట్టారు. ఆమె అనారోగ్య రీత్యా ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఎంఈఓకు సన్మానం



భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: మండల ఎంఈఓ –1గా నూతనంగా పదోన్నతి పొందిన ఎ.భూపాల్‌రెడ్డిని శుక్రవారం సమగ్ర శిక్ష పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ ఆర్ట్, క్రాఫ్ట్ వర్క్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ నాయకులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.కీర మాట్లాడుతూ ఎ.భూపాల్‌రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ నుంచి ఎంఈఓగా పదోన్నతి పొందడం సంతోషదాయకమన్నారు. సంఘాల మండల అధ్యక్ష, కార్యదర్శులు వరప్రసాద్, సత్యనారాయణ, ఉపాధ్యక్షులు విజయ్‌మోహన్, సుధారాణి, నాయకులు రామకృష్ణ, జగన్నాథ్, ఇందిర, శ్యామల పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కందుకూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి: క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదోని క్షయ నివారణ పర్యవేక్షకుడు స్వరూప్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని కందుకూరు ప్రాథమిక కేంద్రం పరిధిలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఆశా వర్కర్లు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు నిర్వహించారు. రెండు వారాలకు మించి తగ్గు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధికి 6 నెలల పాటు మందులు వాడితే పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ గీత, ఏఎన్ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

నందవరం: మండల పరిధిలోని ధర్మపురం గ్రామ సమీపంలో 167వ జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాలు.. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన వినోద్ బైక్‌పై ఎమ్మిగనూరుకి బయలు దేరాడు. ఎమ్మిగనూరుకు చెందిన మోహన్‌కృష్ణ బైక్‌పై మంత్రాలయం వైపు బయలు దేరాడు. రెండు బైక్‌లు ఘటనా స్థలంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడిన వినోద్, మోహన్ కృష్ణలను అటుగా వెళ్తున్న మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమ ఎరువుల అమ్మకాలపై నిషేధం



దుకాణంలో ఎరువుల స్టాక్ రికార్డును పరిశీలిస్తున్న ఏఓ

కోసిగి: అనుమతులు, సరైనా స్టాక్ బిల్లులు లేకుండా అక్రమంగా వివిధ దుకాణాల్లో నిల్వ ఉన్న రూ.16.5 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు కోసిగి మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం కోసిగిలోని పలు ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లలో నిల్వ ఉన్న ఎరువుల స్టాక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కటి స్టాక్ రికార్డులో నమోదు చేయాలన్నారు. కొనుగోలు, అమ్మకాల నిల్వలు, స్టాక్ అన్నీ సక్రమంగా ఉండాలన్నారు. నిల్వ ఉన్న వాటికి బిల్లులు చూపించి విక్రయాలు చేయాల్సి ఉంటుందని యజమానులకు సూచించారు. అలాగే రైతులు కొనుగోలు చేసి ప్రతి దానికి బిల్లు ఇవ్వాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీబీ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ



హెచ్.మురవణి పీహెచ్‌సీలో కిట్లును పంపిణీ చేస్తున్న అధికారులు

పెద్దకడబూరు: మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో నివసిస్తున్న పేద క్షయవ్యాధి (టీబీ) రోగులకు పోషకాహార కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్లు రవిచంద్రకుమార్, ఫిర్దోస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్, పీపీఈ ఉమాపతి మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సహకారంతో ఐదు నెలలుగా నిరుపేద టీబీ రోగులకు పోషకాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. నెలకు సరిపడా కిట్‌ను 6 నెలల పాటు అందించనున్నట్లు తెలిపారు. రోగం నుంచి పూర్తిగా కోలుకోవాలంటే మందులతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రోగులు క్రమం తప్పకుండా గళ్ల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పేద టీబీ బాధితులను దత్తత తీసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలంటూ ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, భాస్కర్, శ్రీధర్, కిశోర్‌కుమార్, సీహెచ్‌ఓలు ఆదినారాయణ, సుశీల, పీహెచ్ఎన్ లక్ష్మినరసమ్మ, ఫార్మసిస్ట్ శ్రీదేవి, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు



నాలేకల్లు గ్రామంలో అసేన్, ఉసేన్ పీర్ల ఊరేగింపు

పెద్దకడబూరు: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పురస్కరించుకుని శుక్రవారం చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దకడబూరు, గంగులపాడు, కంబలదిన్నె, చిన్నతుంబళం, నాలేకల్లు గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా నాలేకల్లు గ్రామంలో 60 ఏళ్లుగా వలీసాబ్ తాత ప్రారంభించిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఆయన వారసుడు షబ్బీర్ తాత శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు అసేన్, ఉసేన్ పీర్లను ఎత్తుకొని ఊరేగింపు ప్రారంభించారు. మేకడోణ, ముచ్చగిరి, పెద్దతుంబళం, కొత్తూరు, దొడ్డనగేరి, మంత్రికి, జాలిమంచి గ్రామాల పొలిమేరల్లో ఊరేగింపుగా వెళ్లి, ఉదయం 11.30కు గ్రామ మసీదు వద్ద కార్యక్రమాన్ని ముగించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు పండాలని.. రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

స్టేట్ బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు

ఆదోని రూరల్: ఇటీవల జరిగిన ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు ప్రాతినిథ్యం కల్పించలేదని కొందరు న్యాయవాదులు రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కౌన్సిల్‌లో చర్చించిన అనంతరం బార్ కౌన్సిల్ వారు ఆదోని బార్ అసోసియేషన్‌కు ఓ లేఖ రాసింది. లేఖ అందిన వారం రోజుల్లోగా బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ప్రస్తుత అధ్యక్షుడు శ్రీరాములును లేఖలో కోరింది.

లేఖ అందలేదు – శ్రీరాములు, ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

మహిళా న్యాయవాదులెవరూ పోటీ చేయడానికి ముందుకు రాలేదు. రాష్ట్ర బార్ కౌన్సిల్ రాసిన లేఖ నాకు అందలేదు. లేఖ అందిన వెంటనే ఎగ్జిక్యూటివ్ బాడీలోకి మహిళా న్యాయవాదులను తీసుకునే అంశంపై తగు నిర్ణయం తీసుకుంటాం.

నాటుసారా స్వాధీనం



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రణమండల కొండల్లోని నాటుసారా స్థావరంపై దాడులు చేసి 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ సైదుల్ శుక్రవారం తెలిపారు. దాడుల్లో 270 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ కార్తికేయ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.